# స్నేహిత

స్తబ్దత నుంచి బాధ్యత వైపు...



స్త్రీవాద వ్యాస సంకలనం

కె.శ్రీదేవి

# విషయ పరంపర...


| | | |
|---|---|---|
| 1. | స్తబ్దత నుండి బాధ్యత వైపు... | 5 |
| 2. | స్త్రీవాద సాహిత్యం - తాత్విక భూమిక | 12 |
| 3. | స్వాతంత్ర్యానంతర కోస్తాంధ్ర స్త్రీల వ్యాస సాహిత్యం | 33 |
| 4. | తెలుగు సాహిత్య విమర్శలో స్త్రీవాద దృక్పథం | 44 |
| 5. | స్త్రీవాదం - అనుభవ విభిన్నత | 65 |
| 6. | స్త్రీల కథా సాహిత్య వికాసం | 75 |
| 7. | పురుష కేంద్రక రాజ్య స్వభావం - పునర్మూల్యాంకనం | 90 |
| 8. | సి.సుజాత సాహిత్యం - స్త్రీవాద దృక్పథం | 106 |
| 9. | ఆత్మిక ఆంతరంగిక ప్రపంచాన్ని ఆవిష్కరించిన వసుంధరాదేవి కథలు | 118 |
| 10. | రెండు దశాబ్దాల స్త్రీవాద కథా గమనం | 126 |
| 11. | దేశీయ స్త్రీవాద భూమికలు - ఛాయాదేవి కథా తరు ఛాయలు | 144 |
| 12. | ఆచంట శారదాదేవి కథల్లో అస్తిత్వ స్పృహ | 152 |
| 13. | స్త్రీల కథల్ని విస్మరించిన 'సీమ వ్యవసాయ కథ' | 158 |
| 14. | నవ మహిళా ప్రవాహం - ఓల్గా సాహిత్యం | 163 |
| 15. | స్త్రీ పురుష సంబంధాలను చర్చించిన 'అతడు - ఆమె' - ఓల్గా - మనం | 181 |
| 16. | 'కాలాతీత వ్యక్తులు' లోని సమకాలీనత | 188 |
| 17. | మనసు దోచిన మధురవాణి | 197 |
| 18. | బహు భార్యత్వ వ్యవస్థలో సత్యభామ అస్తిత్వ అన్వేషణ | 202 |

# స్థబ్దత నుంచి బాధ్యతవైపు

**ఆధునిక** యుగంలో తెలుగు సమాజంలో కొనసాగిన రెండు ప్రముఖ ఉద్యమాలుగా కమ్యూనిస్టు ఉద్యమాన్ని, స్త్రీవాద ఉద్యమాన్ని చెప్పుకోవాలి. అయితే కమ్యూనిస్టు ఉద్యమానికి నిర్థిష్ట మైన సైద్ధాంతిక బలం ఉండటం వలన ఒక నిర్థిష్ట కార్యాచరణ రూపాలుండటం వలన అది వివిధ స్థాయిలలో ఈనాటికి కొనసాగుతూ ఉంది. స్త్రీవాదం ఇందుకు భిన్నంగా తెలుగు సమాజంలో నిర్థిష్ట సైద్ధాంతిక చట్రాన్ని రూపొందించు కోక పోవటమే కాక నామమాత్రంగా ఉన్న ఆలోచనాధారలైన కార్యాచరణలో పెట్టుకోకపోవడం వలన ఇవాల్టికి కూడా అంటే నాలుగు దశాబ్దాల తర్వాత కూడా అదింకా ఒక అమూర్త ఉద్యమంగానే ఉంది. దానికి ఒక ఉద్యమ రూపం ఇవ్వడానికి జరిగిన ప్రయత్నాలన్నీ స్వచ్ఛంద సంస్థల పర్యవేక్షణలో జరగడం వలన ఆయా స్వచ్ఛంద సంస్థల నిర్మాణ, సైద్ధాంతిక పరిమితులు ఆ ఉద్యమాన్ని కూడా ప్రభావితం చేశాయి. దాని ఫలితంగా కూడా స్త్రీవాదం తెలుగులో కొన్ని వ్యతిరేక సంఘటనలు జరిగినప్పుడు కొన్ని కరపత్రాలు వేయడానికీ, కొన్ని ఊరేగింపులు చేయడానికి మాత్రమే పరిమితం అవటం జరిగింది, ఎక్కువ సందర్భాలలో స్త్రీవాదంపైన వెలువడిన బలహీనమైన విమర్శలకు

కేవలం కొంత ఆవేశంతో కవిత్వరూపంలో ఇచ్చిన సమాధానాలు కూడా అంతే అమూర్తంగా వున్నాయి.

ఈ క్రమం మొత్తం వెనుక స్త్రీవాద సైద్ధాంతిక చట్రం అనేది రూపొందకపోవడం అనేది స్పష్టంగా అనిపిస్తుంది. అందువలన సాహిత్యంలో అది ప్రతిఫలించలేకపోయింది. స్త్రీవాదాన్ని సైద్ధాంతపరంగ మిగతా ఉద్యమాలలో జరిగినట్లుగా సమాజంలోని వివిధ పార్శ్వాలను, విశ్లేషించే సాధనంగా ఉపయోగించుకోవటంలో స్త్రీవాదులు విఫలమయ్యారు. ఈ వైఫల్యంలో మనం స్పష్టంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఒక సిద్ధాంతం అనేది సృజనాత్మకంగా సమాజంలోని అన్ని పార్శ్వాలను విశ్లేషించగల అన్ని పరికరాలను రూపొందించుకోగలగాలి. అటువంటిది లేనప్పుడు ఏ సిద్ధాంతమైనా నామమాత్రంగా మాత్రమే సామాజిక విశ్లేషణ చేయగలుగుతుంది. ఈ విషయాన్ని నాలుగు దశాబ్దాలుగా విన్న స్త్రీవాదం లేక స్త్రీవాదులలో ఎవరూ కూడా గుర్తించినట్లులేరు. సైద్ధాంతికంగా చెప్పాల్సి వచ్చినప్పుడు స్త్రీవాదం అంటే కేవలం పిత్రుస్వామ్యాన్ని నిరాకరించే ఒక అమూర్త విషయంగానే చూశారు తప్ప దాన్ని ఒక సమగ్ర సిద్ధాంతంగా రూపొందించుకోని మొత్తం సమాజంలో అమలవుతున్న అణచివేత రూపాలను విశ్లేషించేందుకు అవసరమైన సాధనాలు స్త్రీవాదులకు లేకుండా పోయాయి. దీనికి తోడు స్త్రీవాదుల కార్యక్షేత్రం ప్రధానంగా సాహిత్యం, అందులోను కవిత్వం కావటం వలన దానిలో వుండే అనిర్ధిష్టత సైద్ధాంతిక రూపకల్పనలోనూ ప్రతిఫలించింది.

ఓ వంద సంవత్సరాల ఆధునిక సాహిత్య ఉద్యమాలలో సైద్ధాంతిక బలమున్నవి కూడా అంతిమంగా కొన్ని విషయాలను అజండా మీదకు తేవడం ద్వారానే సాధించగలిగారు. ఇటువంటి నేపథ్యంలో నిర్ధిష్ట సిద్ధాంత బలం లేని స్త్రీవాదం తనకు తాను సామాజిక క్షేత్రంలో నిలుపుకోవడం అంత సులువు కాదు. ఈ విషయాన్ని స్త్రీవాదులు ఎంతసేపటికి గుర్తించక కేవలం సాహిత్యానికి మాత్రమే పరిమితం అయ్యారు. ఈ పరిమితం వలన గడిచిన నాలుగు దశాబ్దాలలో స్త్రీవాదం ఏమి సాధించింది? అని విశ్లేషించుకొన్నప్పుడు వచ్చే సమాధానం సంతృప్తికరంగా కనిపించదు. దీనికి మరో కారణం అసలు స్త్రీవాదం నిర్దిష్టంగా తెలుగు సమాజంలో బలపడక ముందే కొంతమంది వ్యక్తుల లేదా బృందాల అభిప్రాయాలను ఇష్టాఇష్టాలకు అనుగుణంగా నడిచే ఉద్యమంగా మారిపోయింది. దీనికి తోడు సరళీకృత ఆర్ధిక విధానాల నేపథ్యంలో దేశంలోకి దూసుకువచ్చిన విదేశీ స్వచ్ఛంద సంస్థలు స్త్రీవాదుల మధ్య వాతావరణాన్ని సృష్టించడంలో విజయవంతమయ్యాయి. ఇది కూడా స్త్రీవాద సిద్ధాంతంగానీ ఉద్యమంగానీ బలపడక పోవటానికి వున్న కారణాలలో ఒకటి. పై క్రమం మొత్తాన్ని పరిశీలించిన తరువాత తెలుగు సమాజంలో స్త్రీవాదం ఏమీ సాధించలేదా? అనే ప్రశ్న తలెత్తుతుంది. అయితే ఈ ప్రశ్నకు అంత నిరాశాజనకమైన

# స్వాతంత్ర్యానంతర కోస్తాంధ్ర స్త్రీల వ్యాస సాహిత్యం

**అన్ని** సాహిత్య రూపాలలాగానే వ్యాసం అనే వ్యక్తీకరణ రూపం కూడా చాలా కాలం పాటు స్త్రీలను చేరుకోలేదు. అసలు ఎటువంటి భావవ్యక్తీకరణకు నోచుకోని స్థితిలో అత్యంత క్లిష్టమైన intellectual activity గా పరిగణించబడ్డ వ్యాసాన్ని స్త్రీలు తమ అనుభవ కేంద్రంగా రాయడానికి చాలా ఏండ్లు పట్టింది. అయినప్పటికి 1940ల నాటికి పరిగణింపదగిన స్థాయిలో స్త్రీ రచయితలు తమ భావవ్యక్తీకరణకు వ్యాసాన్ని సాధనం చేసుకున్నారు. అయితే వాళ్ళ భావాలు ఆనాటి సగటు స్త్రీ చైతన్యాన్ని మాత్రమే ప్రతిబింబించాయి. ఆనాడు స్త్రీలున్న సామాజిక సందర్భంలో రాడికల్ ప్రతిపాదనలు రావడం అసాధ్యమైన విషయం అని వేరుగా చెప్పనవసరం లేదు. అయినప్పటికి అసలు స్త్రీలు రచనవైపు రావటమే ప్రగతి కాముకత్వంగా భావించబడుతున్న సందర్భంలో స్త్రీలు వ్యాసాన్ని సొంతం చేసుకోవడం చిన్న విషయమేమీ కాదు.

వ్యాసరూపాన్ని గురించి ఒక ఆంగ్ల విమర్శకుడు ఇలా అన్నారు. ఇంత సంక్లిష్ట రూపాన్ని సొంతం చేసుకోవడం చిన్న విషయం కాకపోయినప్పటికి స్త్రీలు వ్యాస రచనలో తమదైన

సొంత ముద్రను వేయగలిగారు. అలా ముద్రవేయగలిగిన కొంతమంది స్త్రీ వ్యాసకర్తలను పరిచయం చేసే లక్ష్యంతో ఈ వ్యాసం రాయటం జరిగింది.

నిజానికి తెలుగు సాహిత్యంలో స్త్రీలు రాయటం అనేది స్వాతంత్ర్యోద్యమానికి ముందే మొదలైంది. అయితే ఆకాలంలో వస్తురూపాలు రెండింటి పరంగా స్త్రీలు తొలి అడుగులు మాత్రమే వేశారు. వస్తునిర్ధిష్టత, రూపనిర్ధిష్టత, రెండూ కూడా ఆ కాలంలో స్త్రీలకు సాధ్యం కాలేదు. తమ భావ వ్యక్తీకరణకు సరైన మాధ్యమాన్ని వెతుక్కునే ప్రయత్నం వాళ్ళు కొనసాగించారు. వ్యాస రూపం మీద పట్టు కోసం ప్రయత్నిస్తూనే వచ్చారు. ఫలితంగా స్వాతంత్ర్యం తరువాత స్త్రీ వ్యాసం అనేది ఏదో ఒక స్థాయిలో నిర్ధిష్టతను సంతరించుకుంది. దాని నేపథ్యంలో జరిగిన కృషిని మాత్రం విస్మరించకూడదు. ఇరవయ్యవ శతాబ్దపు తొలి నాళ్ళలో మొదలై కొనసాగుతున్న సంఘ సంస్కరణోద్యమం స్త్రీలను సమాజ బహిరంగ తలంలోకి ఆహ్వానించింది. స్త్రీ విద్య గురించి ఎక్కువగా ప్రచారం చేసింది. కుటుంబ వికాసానికి స్త్రీ విద్య ఎంత అవసరమో నిర్ద్వందంగా సామాజిక రంగంలో ప్రతిష్టించి, ఎవ్వరూ స్త్రీవిద్యను నిరాకరించలేని స్థితిని ప్రతిపాదించింది. ఎప్పుడైతే స్త్రీవిద్య అత్యవసరం అనే భావన సర్వత్రా ఆమోదానికి గురైందో ఆ మరుక్షణమే స్త్రీలు విద్యారంగంలోకి తరలివచ్చారు. తద్వారా తమ ఆలోచనా పరిధిని, భావనా శక్తిని, భావుకతను, అధ్యయనాన్ని పెంచుకోగలిగారు. ఈ క్రమం నిరంతరం బలోపేతమవుతూ 1940ల నాటికి ఇంతకు ముందు చెప్పుకున్నట్లుగా నిర్ధిష్టతను సంతరించుకుంది. ఈ నిర్ధిష్టతను గుర్తించాలంటే స్వాతంత్ర్యానికి ముందు స్వాతంత్ర్యానికి తరువాత వెలువడిన స్త్రీ రచనలు చూస్తే తెలుస్తుంది. 1940లకు ముందు జరిగిన వుద్యమాలు, పత్రికలు, బహిరంగ సభలు అన్నీ కూడా పురుషకేంద్రకంగానే వుండేవి. 1940ల తరువాత ఈ రంగాలలోకి స్త్రీలు కూడా విస్తరించారు. సంఘసంస్కరణోద్యమ భావాలు, జాతీయోద్యమం రెండు కూడా ఒక రకంగా స్త్రీలు ఈ రంగాలలోకి విస్తరించడానికి దోహదం చేశాయి. ఇంతకు ముందు పురుషులు మాత్రమే మాట్లాడుతున్న, చర్చిస్తున్న అంశాల గురించి నిస్సం కోచంగా మాట్లాడటం, రాయడం చేశారు. స్త్రీ విద్య, వితంతు వివాహాలు, బాల్య వివాహాల్లాంటి అంశాల గురించి స్త్రీలు కూడా మాట్లాడారు. అయితే ఇవాళ వాటిని చదువుతున్నప్పుడు మనకు కలిగే అభిప్రాయం ఏమంటే, అవి పురుష భావాలకు అనుబంధంగానే, విస్తరణగానే వుంటాయే తప్ప స్వతంత్రంగా, నిర్ణాయక శక్తితో (decision making power) తీసుకున్నవిగా అనిపించవు. స్త్రీలు ఆనాటికి స్వతంత్ర ఆలోచన స్థాయికి చేరుకోలేదు. స్త్రీభావ ప్రపంచం ఇంకా అప్పటికి పురుషకేంద్రక ఆలోచనా చట్రంగానే తిరుగుతుంది.

స్వాతంత్ర్యానంతరం దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో వచ్చిన

# స్త్రీవాదం - అనుభవ విభిన్నత

**“Women** is writing proceeds from body, that our sexual difference is also our source.”

- Corolyn Burke.

**స్త్రీ పురుషుల** మధ్య సహజసిద్ధమైన విభిన్నత వుందా? అనేది స్త్రీవాదంలో కీలకమైన ప్రశ్న. అలాగే స్త్రీ శారీరకంగా తానున్న స్థితి వల్ల స్త్రీగా గుర్తింపబడుతుందా లేక ఆమె ప్రవర్తన వల్ల అలాగ గుర్తింపబడుతుందా అనేది కూడా ప్రశ్న. స్త్రీవాదుల్లో కొంత మంది స్త్రీలు పురుషుల నుంచి శారీరకంగా విభిన్నంగా వుండటం వల్ల వాళ్ళు మానసికంగా, అనుభవపరంగా కూడా విభిన్నంగా వుంటారని వాదిస్తారు. ఈ విభిన్నతని అధిగమించాల్సిన అవసరం లేదని, అదేమీ సిగ్గు పడాల్సిన విషయం కాదని, పైగా ఆనందించాల్సిన విషయాన్ని, స్త్రీలు గుర్తించాల్సిన విషయమని కూడా చెబుతారు. ఈ విభిన్నతను స్త్రీలు గుర్తించి అన్ని రంగాలలో పురుష కేంద్రక విలువల్నించీ బయటపడి తమ ప్రత్యేకమైన లేక విభిన్నమైన గుర్తింపును చాటుకోవాలని భావిస్తారు. ఈ గుర్తింపు గురించి Fiona Tolan అనే విమర్శకు రాలు ఇలా అంటారు..

"This identity is frequently described as being more emphathetic and cooperative, more connected to others, and more accepting of multiple view points, unlike male identity, which is monolithic authoritarian, and found in a rationalist belief in one truth" (Litt Items and criticism," Ed potrica wanger, Delhi:OUP 2006 P.323)

అయితే సైమన్ దబోవా లాంటి వాళ్ళు ఈ పై వాదాన్ని ఖండించారు. లైంగిక విభిన్నత అనేది సాంస్కృతిక నియంత్రణ లేక అదుపు ఫలితమని, అసలు పితృస్వామిక సమాజం స్త్రీని పరాయి (other) గా మార్చబడిందని, దాని ఫలితంగానే ఈ విభిన్నత అనే భావన తలెత్తిందని, దీన్ని బహిర్గతం చేసి తమ గుర్తింపును చాటుకునే క్రమంలో స్త్రీ పురుషుడితో సమానంగా తన పూర్తి శక్తుల్ని వ్యక్తీకరించుకోగలదని దబోవా ప్రకటించింది.

1970 లలో 'The Dialectic of Sexes' ద్వారా విశేష ప్రచారాల నుండి వచ్చిన షూలామిత్ ఫైర్ స్టోన్ (Shulamith Firestone) దబోవా దారిలోనే ప్రయోగిస్తూ స్త్రీ శరీరం మీద మోపబడ్డ పరిమితులన్నీ టెక్నాలజీ ద్వారా అధిగమించటానికి అవకాశముందని ప్రకటించారు. ఫైర్ స్టోన్ మరింత ముందుకెళ్ళి కృత్రిమంగా గర్భధారణ artificial gestation, సామూహిక పిల్లల పెంపకం లాంటి భావనలను ముందుకు తేవటం జరిగింది. ఇవి స్త్రీ మీద మోపబడిన మాతృత్వం లాంటి భావనల నుంచి విముక్తం చేస్తాయని ఆమె భావించింది. ఎప్పుడైతే శరీర విభిన్నతను స్త్రీలు అధిగమించ గలుగుతారో, ఆ మరుక్షణమే, సాంస్కృతిక విభిన్నతలు అంతరాలు స్త్రీ పురుషుడితో అనివార్యంగా చూడబడుతుందని ఆమె భావించారు. స్త్రీ నిర్వహిస్తున్న పునరుత్పత్తి కార్యక్రమం అనేది ఆమెను ఎప్పుడూ పురుషుడి కంటే తక్కువ స్థాయిలో నిలబెడుతుందని ఆమె నమ్మింది. ఆమె దృష్టిలో చాలా స్పష్టంగా స్త్రీ పురుషుల మధ్య అసమానత్వాన్ని నెలకొల్పింది. శరీర విభిన్నత కాదు, అందుకు విరుద్ధంగా ఆమె నిర్వహిస్తున్న పునరుత్పత్తి కార్యక్రమమే ఆమెను తక్కువగా చూసేందుకు కారకమవుతుంది. ఎప్పుడయితే సాంకేతిక పర్జ్ఞానాన్ని పూర్తిగా ఈ పునరుత్పత్తి క్రమంలో వాడుకోవటం జరుగుతుందో, అప్పుడు స్త్రీ పురుషుల మధ్య సమానత్వం సాధించటం సులువవుతుందని ఆమె భావించింది.

సారాంశంలో దబోవా, ఫైర్ స్టోన్ ఇద్దరూ కూడా సంస్కృతి అనేది జండర్ రహిత రంగమని, పురుషుడే ఆ రంగం నుండి స్త్రీని నెట్టివేశాడని, దాన్ని జయించడం స్త్రీలకు లక్ష్యంగా వుండాలని భావించారు. సారాంశంలో వీళ్ళు హేతువాద సంప్రదాయాలలోని Mind – body విభజనలోంచే ఆలోచించారు. హేతువాద సంప్రదాయం మేధతో పురుషుణ్ణి, శరీరంతో స్త్రీని గుర్తించింది. వీళిద్దరి ఆలోచనలకు

# పురుష కేంద్రక రాజ్య స్వభావం పునర్మూల్యాంకనం

**మిత్** (myth) లు లేక పౌరాణిక ప్రతీకలు అనేవి ఆధునిక మానవ అవగాహనలో అనివార్యంగా ఆవరించి వున్నాయి. సగటు మనిషి భాషలో అవి అంతర్భాగమయ్యాయి. వాటిని ఆశ్రయించి వుండే భావజాలం ఎక్కువగా పురుష కేంద్రకంగా వుంటుంది. పితృస్వామ్యం తనను తాను రక్షించుకుంటూ, సాధికారీకరించుకునే ప్రయత్నంలో భాగంగా అనేక మిత్‌లను సృష్టించింది. భారతం, రామాయణం లాంటి ప్రముఖ సాహిత్య వాచకాలు ఈ మిత్‌లను రోజువారీ భాషలో భాగం చేశాయి. ఫలితంగా పురుష కేంద్రకంగా వుండే ఈ రచనలలోని మిత్‌లు కూడా పురుషకేంద్రంగానే వున్నాయి. ఈ రచనలో సగటు మనిషి సంస్కారంలో, కామన్ సెన్స్‌లో భాగంగా వుండటం వీటిని విస్మరించకుండా సమాజంలోని పితృస్వామిక భావజాలంపైన దాడి చేయడం, దాన్ని నిర్మూలించటం అత్యవసరం. ఆ పనిని స్త్రీవాదులు చేయటం మరింత అవసరం. ఆ అవసరాన్ని కథాసాహిత్యంలో ముందు గుర్తించింది ఓల్గా అని చెప్పుకోవాల్సి వుంటుంది. ఆమె ఇటీవల ప్రచురించిన "మృణ్మ యనాదం" కథాసంపుటిలోని అదే శీర్షికలో వున్న

కథతోపాటు, "సమాగమం" అనే రెండు కథలు ఇందుకు సాక్ష్యాలు. ఈ కథ రామాయణంలో శూర్పనఖ, సీత పాత్రల గురించి 'మిత్'లకు సంబంధించినది. చరిత్ర రచనా శాస్త్రాన్ని (historiography) పునర్ అధ్యయనం చేసి, పునర్నిర్మించినట్లుగా సాహిత్య వాచకాల్ని ముఖ్యంగా పౌరాణిక సాహిత్యాన్ని పునర్ అధ్యయనం (Re-reading) చేయాల్సిన అవసరాన్ని స్త్రీవాదులు గుర్తించారు. ఆ గుర్తింపు లోంచి రాయబడినవే ఈ రెండు కథలు.

'సమాగమం' కథలో మూడు కీలకాంశాలను శూర్పనఖ కథ ద్వారా స్పష్టంచేసే ప్రయత్నం జరిగింది. ఒకటి పురుషుడు స్త్రీని ఒక వస్తువు (object) గా వాడుకునే విధానం, చూసే పద్ధతి, రెండు అందాన్ని గురించి అమలులో వున్న పురుష కేంద్రక దృష్టిని నిరాకరించే, భిన్న సాంస్కృతిక సన్నివేశాల నుంచి వచ్చిన ఇద్దరు స్త్రీల (శూర్పనఖ, సీత) జీవితాల్లో వున్న సారూప్యతను (similarity) బహిర్గతం చేయటం. మొదటి విషయం శూర్పనఖ ముక్కు, చెవులు కోయటంలో రామలక్ష్మణుల లక్ష్యం రావణుని రెచ్చగొట్టాలనే రాముడి అభిమతం. రావణునితో కయ్యానికి కారణం వెతుకుతున్న రాముని అన్వేషణలోని రాజనీతిని లేక వైయుక్తిక రాజకీయాల్ని, ఆ రాజకీయాల్ని నెరవేర్చుకోవటంలో శూర్పనఖ ఒక సాధనంగా, అంటే వస్తువుగా (object) వుపయోగించుకోబడింది. ఈ నేపథ్యంలోనే కథకురాలు "పురుషుల పగలూ, ప్రతీకారాలు తీర్చుకోవటానికేనా స్త్రీలుంది?" అని ప్రశ్నించటం ద్వారా బహిర్గతం చేయటం జరిగింది.

రామలక్ష్మణుల రాజకీయ సాధనలో కురూపిగా మారిన శూర్పనఖ తనలోని ప్రేమను, వైయుక్తిక ప్రపంచాన్ని బయలు పర్చి, బాహ్య ప్రపంచంలో ఆవిష్కరించటానికి అద్భుతమైన పూలతోటని పెంచటం ద్వారా ఆ సౌందర్యాన్ని తన మూర్తిమత్వంలో భాగం చేసుకుంది. కురూపి కావటం వలన శూర్పనఖ ప్రేమించబడడానికి దూరమైంది. తన భర్త తనను అనుమా నించటం వలన సీత రాముడికి దూరమైంది. ఈ స్థితిలో శూర్పనఖకు, సీతకు మధ్య వుండేది అస్తిత్వ సారూప్యమే.

ఎంత కాదనుకున్నా అందం అనే భావన అత్యంత ప్రాముఖ్యం, అమూర్తం. ఇంకా చెప్పాలంటే, అది మరింత సాపేక్షికం. అందువల్ల అందాన్ని గురించిన చర్చ తక్కువేమీకాదు. కుటుంబరావు రెండు మూడు రచనల్లో దాని గురించి కొంత చర్చ చేశారు. కాల్పనిక సాహిత్యంలో, ఆ తర్వాత శారద కూడా తన "మంచి – చెడు" నవలలో ఆ ప్రయత్నం చేశారు. ఈ మధ్యకాలంలో కేవలం ఓల్గా మాత్రమే "సమాగమం" కథలో శూర్పనఖ పాత్ర ద్వారా ఆ పనిని మరింత లోతుగా చేసే ప్రయత్నం చేయటం జరిగింది. శూర్పనఖ, సీత ముందే తన మానసిక ప్రపంచాన్ని ఒక మోనోలాగ్‌లాగా ఆవిష్కరించే క్రమంలో వ్యక్తీకరించ బడింది అందానికి సంబంధించిన భావనలే. అందులోని ఈ వాక్యాలలో శూర్పనఖ పాత్రను, ఆ పాత్ర అంత:స్సారాన్ని, తత్వాన్ని ఆవిష్కరిస్తాయి.

# ఆత్మిక ఆంతరంగిక ప్రపంచాన్ని ఆవిష్కరించిన వసుంధరాదేవి కథలు

**ఆధునిక** తెలుగు సాహిత్యకారుల్ని పరిశీలిస్తే, వీళ్ళలో కొందరు హేతువును (reason) ఆధారం చేసుకొని రచనలు చేస్తే, మరికొందరు intuition ఊతం చేసుకొని ముఖ్యంగా కాల్పనిక సాహిత్యాన్ని సృష్టించారు. ఇందుకు ఉదాహరణలు ఇవ్వాల్సివస్తే, మొదటి తరహా రచనలకు కొడవటిగంటి కుటుంబరావును చూపించవచ్చు. అలాగే రెండవ కోవలో చలాన్ని చూపించవచ్చు. ఈ తరహా రచనలు ఇప్పటికీ తెలుగులో కొనసాగుతున్నాయి. స్త్రీ రచయితలలో ముఖ్యంగా వసుంధరాదేవి కథలలో అన్ని భావాలు ఏదో ఒక స్థాయిలో వున్నప్పటికీ ఆమె కథలు తాత్విక, అస్తిత్వవాద ధోరణిలో నడుస్తాయి. అందువలననే ఈమె కథల్లో intuition కి ప్రాధాన్యత ఎక్కువ. ఈ తరహా కథల్లో కథకులు తాము పరిగణిస్తున్న వాస్తవికతను విశ్లేషణాత్మకంగా చూడటం కాకుండా, అనుభవాత్మకంగా, తమ intuition స్పందనలను ఆధారభూతం చేసుకొని చూడటం జరుగుతుంది. ఈ తరహా కథల్లోని పాత్రలు నిరంతరం అనుభవం ఆధారంగా జీవించడమే కాకుండా తమ అస్తిత్వాన్ని గురించిన ఆందోళనలో వుంటాయి. ఈ తరహా పాత్రలు

వసుంధరా దేవి కథల్లో అనేకం కన్పిస్తాయి. "చెరువుదగ్గర" అనే కథలో సుశీలమ్మ "నేను ఏ అనుభూతీ లేకుండా ఇలానే వదలిపోతాను" అని ఆందోళన పడుతుంది. ఈ అస్తిత్వ అనుభవ సంబంధిత ఆందోళన సుశీలమ్మ మనసులో వ్యక్తమైన తీరును కథకురాలు చాలా శక్తివంతంగా చిత్రించటం జరిగింది. ఈ కథలో "నిస్పృహతో, ఏమో చెయ్యాలని, దేన్నో పొందాలని ఏదో తపన, ఏమీ చెయ్యలేని నిరాశ. తన జీవితం తనది కాదన్నట్లు, ఎవరి బలవంతం మీదనో బతుకుతున్నట్లు బాధ. జీవితంలో ముప్పయ్ అయిదేళ్ళు చాలా భాగం గడచిపోయింది తెలీకుండానే. ఇహ చచ్చిపోవటమే తరువాయి. బ్రతుక్కుండానే చావు!" ఈ విధంగా పాత్రల వైయక్తిక భావనల్ని, అనుభూతుల్ని తాత్వికంగా చిత్రించటం వసుంధరాదేవి కథల్లో చాలా సాధారణాంశం. అలాగే "బదిలీ" కథల్లో ప్రారంభంలోనే narrator "నాకు ప్రపంచం లేదు. బదిలీ అయిపోయింది. నాలోకి బదిలి అయిపోయింది. ఇప్పుడు నేనే ప్రపంచాన్ని" అన్న మాటలు ఇందుకు ఉదాహరణ. (పుట-55 'ఆర్. వసుంధరా దేవి కథలు')

తెలుగులో తాత్విక స్పర్శతో కథలు రాసిన రచయితలు చాలా తక్కువ. అందులోనూ స్త్రీ రచయితలలో చాలా అరుదు. ఈ అరుదైన రచయితల్లో వసుంధరాదేవి ఒకరు. నిజానికి తాత్విక స్పర్శ ఎక్కువ సందర్భాలలో readability దెబ్బతీయటం జరుగుతుంది. రచయితకు ఎంతో సహనం, సంయమనం వుంటే తప్ప ఆ స్థితి నుంచి కథను కాపాడుకోగలగటం సాధ్యంకాదు. వసుంధరా దేవి కథల్లో ఈ సంయమనం చాలా ఎక్కువగానే వుంది. అందువలననే ఆమె తాత్విక కథలు సిద్ధాంత చర్చల్లాగ కాకుండా కథల్లాగానే మిగిలాయి. అస్తిత్వవాద కథల్లో పాత్రలు తమ చుట్టు వున్న, తమను నిరంతరం నిర్దేశిస్తున్న సమాజ భారాన్ని భరించలేని స్థితిలో ఆవేదన చెందటం, ఆ వేదనను సంభాషణలలో (ఈ సంభాషణలు ఎక్కువ సందర్భాలలో monologue మనోగతం రూపంలో వుంటాయి) వ్యక్తమవుతాయి. సరిగ్గా ఈ ధోరణి వసుంధరాదేవి కథల్లో చాలా ఎక్కువగానే కన్పిస్తుంది. అలాగే తమ బాధను ఫిర్యాదులాగా ప్రపంచానికి మనోగత సంభాషణ రూపంలోనే వ్యక్తం చేయటం జరిగింది. ఉదాహరణకు "బదిలీ" కథలోని ఈ వాక్యాలు చూడండి. "అబ్బ! నా మనసు కదిలిపోతున్నది. అందులోని భరింపరాని వేదననుభవిస్తున్నది...ఈ బాధ నేను భరించలేనే...ఆ నిరాశా సముద్రాన్ని నేనీదలేను. ఆ నిస్పృహ పర్వతాన్ని నేనెక్కలేను. నేనెక్కలేను. నేను వేరుగానే వుంటాను. మనసంటే ఏమిటి? ఆశలూ అనుభవాలూ అంటూ దాన్నే పోగేసి ఎంత కొండకట్టాను! ఎంత సముద్రాన్ని సృష్టించాను...అంతా బూడిదైపోయింది...దాన్ని భరించలేను". (పుట-56, ఆర్ వసుంధరా దేవి కథలు).

వసుంధరాదేవి కథలు అస్తిత్వవాద ధోరణికి దగ్గరగా వుంటాయని చెప్పుకున్నాం.

# స్త్రీల కథలను విస్మరించిన

# 'సీమ వ్యవసాయ కథ'

(**బండి** నారాయణస్వామి వ్యాసంపై స్పందన వ్యాసం)

"What you choose and reflect theoratically, that depends upon what you are practically trying to do"

- Terry Eagleton.

సాహిత్య చరిత్రలో స్త్రీల కృషిని గుర్తించ నిరాకరించటం, విస్మరించటం అనేది కేవలం గతానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. వర్తమానం మన కళ్ళముందు జరుగుతున్న చరిత్రలో స్త్రీల రచనలను ignore చేయటం అనేది కూడా తరచుగా జరుగుతున్నది. అందుకు అత్యంత తాజా ఉదాహరణ సెప్టెంబరు 14న "వివిధ" లో బండి నారాయణ స్వామి రాసిన "సీమ వ్యవసాయ కథ" అనే వ్యాసం. మూడు దశాబ్దాలు పైగా తెలుగు సమాజంలో స్త్రీలు, స్త్రీ వాదులు చేస్తున్న కృషిని ఈ వ్యాసం ఎగతాళి చేసినట్లుగా వుంది. రాయలసీమ కథాసాహిత్యానికి, తద్వారా మొత్తం తెలుగు సాహిత్య ఎదుగుదలకు స్త్రీ రచయితలు చేసిన, చేస్తున్న కృషిని ఈ వ్యాసం గుర్తించటానికి నిరాకరించింది. 1910 నుంచి 2009 వరకు

వున్న ప్రముఖ పురుష రచయితల నుంచి చిన్నా చితకా పురుష రచయితల వరకు అందర్నీ పేరుపేరునా కీర్తించిన ఈ వ్యాసకర్తకు పదుల సంఖ్యలో వున్న రాయలసీమ స్త్రీ కథా రచయితలు గుర్తుకు రాకపోవటం కాకతాళీయంగా జరిగినటువంటి చర్య కాదు. చాలా Conscious గానే ఆయన స్త్రీ రచయితల్ని విస్మరించటం, తద్వారా మొత్తం స్త్రీల రచనలను చిన్న చూపు చూసినట్లయింది. నారాయణ స్వామిగారి వ్యాసం కేవలం వ్యవసాయ కథలకు సంబంధించింది. అందువలన స్త్రీ రచయితలు వ్యవసాయం పైన కథలు రాయలేదని, పట్టించుకోనవసరం లేదనే సాకు చూపించటానికి ఎంత మాత్రం అవకాశం లేదు. ఎందుకంటే, గత రెండు దశాబ్దాల కాలం రాయలసీమ నుంచి కథలు రాసిన స్త్రీ రచయితలందరూ వ్యవసాయాన్ని గురించి దాని ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలను గురించి, వ్యవసాయ రంగంలో చోటు చేసుకొన్న సంక్షోభం సామాజిక జీవితాన్ని, తద్వారా స్త్రీల జీవితాన్ని ఏ విధంగా ధ్వంసం చేస్తుందనే విషయాన్ని గురించి అనేక మంది రాయలసీమ స్త్రీలు కథలు రాశారు. నిజానికి నారాయణ స్వామికి ఏ మాత్రం నిష్పాక్షిక దృష్టివున్నా ఆయన సొంత జిల్లా నుంచే అనేక మంది స్త్రీ రచయితలు వ్యవసాయక కుటుంబాలలో జరుగుతున్న దారుణాల నుంచి, ఆ రంగంలోని సంక్షోభం స్త్రీల జీవితాన్ని తారుమారు చేస్తున్న వైనం గురించి చాలా కథలు వచ్చాయి. ఈ విషయాలను గత రెండు మూడు దశాబ్దాలలో రాయలసీమ స్త్రీల కథా సాహిత్యాన్ని ఏ మాత్రం పట్టించకోకుండా, కనీసం ప్రస్తావించకుండా రాయగలగటం వ్యాస రచయిత పాక్షిక దృష్టిని మాత్రమే కాకుండా, ఎంత లోతుగా ఆయన పితృస్వామ్య ఆలోచనా ధోరణిలో కూరుకుపోయారో తెలియజేస్తుంది.

కె.సుభాషిణి, ఆర్.శశికళ, జి.నిర్మలారాణి, జయరాజ్, చిలుకూరి దీవెన, కుడాల లక్ష్మి, యం.ఆర్.అరుణ కుమారి, కె.మధుజ్యోతి, మంజుల, యం.దావన్, షహనాజ్, మధురాంతకం నాగభూషణమ్మ, యం.నాగమణి, యస్.జయ, చక్కిలం విజయలక్ష్మి, కొండూరి శ్రీదేవి, చల్లపల్లి స్వరూపరాణి, డి.నాగమ్మ పూలే, వి.రుక్మిణి, చంద్రకళ, కోమలా దేవి, కె.వసంత ప్రకాశ్ లాంటి దాదాపు ఇరవై మంది రాయలసీమ స్త్రీ రచయితలు సమర్థవంతంగా తమ తమ పరిధిలో కథలు రాస్తున్నారు. ఇక వ్యవసాయ కథల విషయానికొస్తే, అందులోనూ బలమైన, శక్తివంతమైన ఇతివృత్తంతో రచనలు సాగించిన వారిలో కె.సుభాషిణి, జి.నిర్మలా రాణి, ఆర్.శశికళ, జయలక్ష్మీరాజ్, చిలుకూరి దీవెన వున్నారు. వీళ్ళ పేర్లను గానీ, వీళ్ళ రచనల్ని గానీ నామమాత్రంగానైనా ప్రస్తావించక పోవటం అనేది బండి నారాయణ స్వామి పురుషస్వామ్య భావజాలానికి ప్రతీక.

కర్నూలు నుంచి కథలు రాస్తున్న కె.సుభాషిణి కరువు నేపథ్యంలో "కరువెవరికి" అనే కథ రాశారు. దారుణమైన వరుస కరువులు కరువు దాడులకు ఎలా పురికొల్పుతాయో

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Snehita**

* * *